క్లుప్తంగా

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు



నిడదవోలులో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిడదవోలు: టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించి త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని ఏపీ టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి అన్నారు. నిడదవోలు తీరుగూడెంలో ఉన్న టిడ్కో గృహాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా నాగేశ్వరి మాట్లాడుతూ టిడ్కో గృహాల వద్ద రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, ఏపీ టిడ్కో టెక్నికల్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో పట్టణంలో 23వ వార్డులో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, మళ్లీ సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ గౌరవ అధ్యక్షుడు నగ్గళపాటి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని, నియోజకవర్గంలోని నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నేడు త్యాజంపూడిలో గడపగడపకు

దేవరపల్లి: దేవరపల్లి మండలం త్యాజంపూడిలో బుధవారం ఉదయం 9 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి వీరవెంకట సతీష్ తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించినున్న ఈ కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

నల్లజర్ల: పేద విద్యార్థుల చదువుకు మానవత సంస్థ అండగా నిలుస్తోందని మండల శాఖ అధ్యక్షుడు గుళ్లపూడి వెంకటరత్నం అన్నారు. చీపురుగూడెం గ్రామానికి చెందిన రాజులపాటి రేణుక ఫిజియోథెరపిస్ట్ కోర్సు చదువుతోంది. విద్యాఖర్చుల నిమిత్తం ఆమె తండ్రి రాజులపాటి సూర్యనారాయణకు మంగళవారం రూ.10వేలు మానవత సంస్థ అందజేసింది. భీమడోలుకు చెందిన శాంతిరథం డ్రైవరు యు.నాగరాజు కుమారుడు నానిశ్రీ సత్య బీటెక్ చదువుతున్నాడు.అతనికి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, మండల చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, గుత్తికొండ వరప్రసాద్, ఉన్నమట్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వండి

కొవ్వూరు: గంజాయి, నాటుసారా, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలతో పాటు మీ ప్రాంతంలోని అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ కోరారు. పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలపై పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు

నిడదవోలు రూరల్: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు పట్టణ ఎస్సై పి.నాగరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలులోని ఇందిరానగర్‌కు చెందిన సంసాని చంద్రమౌళి, హరివికాస్‌లో స్ప్లెండర్ బైక్‌పై మంగళవారం ఉదయం కొయ్యలగూడెం వెళుతుండగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రమౌళి కాలుకి తీవ్రగాయాలు కాగా, హరివికాస్ చేతికి గాయాలవ్వడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మనస్థాపంతో కోర్టు ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు: గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి సిద్ధమైన మండా సుభాష్ చంద్రబోస్‌ను మంగళవారం పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ రక్షించారు. సుభాష్ చంద్రబోస్ భీమవరంలో సెకండ్ అడిషనల్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. రోడ్డు కం రైలు వంతెనపై 144వ స్తంభం వద్ద రైలింగ్ ఎక్కి గోదావరి నదిలో దూకేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయానికి రాజమహేంద్రవరం నుంచి జీపులో కొవ్వూరు వస్తున్న ఎస్సై అప్రమత్తమై ఆయనను రక్షించారు. స్టేషన్‌కి తరలించి కౌన్సెలింగ్ చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సకాలంలో గుర్తించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై దుర్గా ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ అభినందించారు. భీమవరం నుంచి వచ్చిన అతని తల్లిదండ్రులకు అప్పగించారు. సుభాష్ భీమవరంలో అల్లూరి సీతారామరాజు నగర్‌లోని ప్రకాశం వీధికి చెందినవాడన్నారు. వ్యక్తిగత కారణాలతో సుభాష్ మనస్థాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించండి

- ఎంపీపీ కేవీకే దుర్గారావు
- దేవరపల్లి మండల పరిషత్‌కు మిగులు బడ్జెట్
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు



దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2023–24 వార్షిక బడ్జెట్‌ను ఎంపీపీ కేవీకే దుర్గారావు మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లోని అంశాలను ఆయన సభ్యులకు చదివి వినిపించగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రారంభ నిల్వ రూ.80,60,120, రాబడి రూ.15,69,61,000, మొత్తం బడ్జెట్ రూ.16,50,21,120 ఆదాయంగా చూపించారు. దీనిలో వ్యయం రూ.15,53,88,000, రూ.96,33,120 మిగులు బడ్జెట్‌గా వెల్లడించారు. సమావేశానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని, అవసరమైన గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వేసవిలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దుద్దుకూరులో లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉన్నందున ఐదు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ కోరారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కుమారి మాట్లాడుతూ దేవరపల్లిలో డ్రెయిన్, కల్వర్టు నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరు కాగా టెండర్లు పిలిచినట్టు ఆమె తెలిపారు. జలజీవన్ మిషన్‌లో 46 పనులు మంజూరయ్యాయని, వీటిలో రూ.5 లక్షల లోపు పనులు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.3.10 కోట్లు మంజూరైనట్టు ఆమె చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె. విజయ్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో మండలంలో రూ.18.67 కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో 40 శాతం సబ్సిడీపై ఏడు ట్రాక్టర్లు రైతులకు అందజేసినట్టు ఆయన తెలిపారు. దాళ్వాకు సంబంధించి రైతులు ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. రబీలో రూ.36 కోట్ల విలువ గల ధాన్యం ఉత్పత్తి అవుతుందని ఆయన తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఆర్.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ దేవరపల్లి బాలుర హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున మూసివేసి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను వేరొక హాస్టల్‌కు పంపించినట్టు ఆయన తెలిపారు. గౌరీపట్నం బాలుర హాస్టల్లో 12 మంది విద్యార్థులున్నారని ఆయన చెప్పారు. లక్ష్మీపురం, పల్లంట్ల గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో 24 గంటలు వైద్య సేవలందించాలి



తాళ్లపూడి పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

తాళ్లపూడి: పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందజేయాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు సిబ్బందికి తెలిపారు. తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులకు ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు, మరొకరు సెలవు పెట్టారని తెలిపారు. ముగ్గురు స్టాఫ్ నర్సులకు గాను ఒకటి ఖాళీగా ఉందని, మరొకరు మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారన్నారు. ఇద్దరు డాక్టర్లు లేని కారణంగా మలకపల్లి వైద్యాధికారి అన్నపూర్ణను ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్టు తెలిపారు.

సంక్షేమ రాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- నెలటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



నెలటూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: సంక్షేమ రాజ్యం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మంగళవారం నెలటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు మంత్రి వనిత వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, లకంసాని సూర్యప్రకాశరావు, సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, లకంసాని రామకృష్ణ ఎంపీటీసీ తాళ్లూరి రమ్య, నెలటూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గేదా శ్యామ్, తాళ్లూరి దామోదరం, కరుటూరి శ్రీను, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీల ఆధునీకరణకు కృషి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- త్యాజంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



త్యాజంపూడిలో మహిళకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామాల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయినేజీల ఆధునికీకరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం త్యాజంపూడిలో మంగళవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకు ఆయన వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఒక్కొక్క ఇంటికి రూ. 2 నుంచి 4 లక్షల వరకు సంక్షేమ పథకాలు అందినట్టు ఆయన చెప్పారు.ఈ సందర్భంగా డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని మహిళలు ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. గుమ్మల శ్రీను మాట్లాడుతూ తన కుమరుడు స్థానిక జెడ్పీ హైస్కూల్లో చదువుతున్నాడని, అమ్మఒడి రావడం లేదని ఎమ్మెల్యే వద్ద వాపోయాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గ్రామంలో గడప గడపకు నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని గ్రామ సచివాలయం ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. మూడేళ్లుగా గ్రామంలో సుమారు 6 కిలోమీటర్ల డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. గ్రామంలో సుమారు రూ.5.68 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు ఆయన అన్నారు. గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్ట స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఆచంట అనసూయ, పార్టీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్, ఎంపీటీసీ సభ్యులు పల్లి రాంబాబు, సొసైటీ అధ్యక్షులు కాకర్ల శోభన్ కుమార్, మాజీ సర్పంచ్ పల్లి వెంకటరత్నారెడ్డి, ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక



దేవరపల్లిలో పొగాకు తోటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు

దేవరపల్లి: రబీలో పండించిన ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రాల ఏర్పాటుకు ప్రాణాళిక సిద్ధం చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు తెలిపారు. దేవరపల్లి మండలంలోని బందపురం, దేవరపల్లి, అచ్చయపాలెం గ్రామాల్లో ఈ– పంట నమోదును మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్‌లో 239 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం పూర్తిగా కొనుగోలు చేసినట్టు ఆయన చెప్పారు. రైతులకు 21 రోజులు దాటకుండా ధాన్యం సొమ్ము చెల్లించామని చెప్పారు. ఖరీఫ్‌లో జిల్లాలో 4.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో కోరుకొండ, సీతానగరం, కొవ్వూరు డివిజన్‌లో గోపాలపురం మండలాల్లో ఆలస్యంగా నాట్లు వేసినందున వారం రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. రబీలో 56 వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోందని ఆయన తెలిపారు. ఆరు వేల హెక్టార్లలో పొగాకు, 12,500 హెక్టార్లలో మొక్కజొన్న, చిరుధాన్యాల సాగులో భాగంగా 210 హెక్టార్లలో జొన్న పంట సాగు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. మరొక 340 హెక్టార్లలో చిరుధాన్యాల పంట వేయవలసి ఉందని ఆయన చెప్పారు. రబీలో నమోదు చేసిన ఈ–పంటను పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కె. విజయ్, వీఏఓ జె. కవిత, వ్యవసాయాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ప్రభు పర్యవేక్షించారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

కాకరపర్రులో

పెరవలి: పెరవలి మండలం కాకరపర్రులోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా మంగళవారం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అనంతరం లక్ష తులసి పూజ చేసి, సాయంత్రం కల్యాణం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం

నల్లజర్ల: స్థానిక శ్రీరామకృష్ణ భక్తమందిరంలో శ్రీభగవన్నామ సంకీర్తన 78వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పూజలు, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వెల్లంకి వెంకటసుబ్రమణ్యం దంపతులు పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. బుధవారం నుంచి 5రోజుల పాటు ఏకాహం, సంకీర్తన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు గోష్పాదక్షేత్రంలో చండీహోమం

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని ఆత్మీయ హితకారిణి సమాజం జ్ఞానమందిరంలో చండీహోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్ఎస్ వాజ్‌పేయ్ తెలిపారు. అనంతరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

గడువులోగా నమోదైతేనే 'భరోసా'



నల్లజర్లలో ఈ- పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

నల్లజర్ల: రబీలో పంటలు సాగు చేసే వారంతా తప్పనిసరిగా ఈ–పంట యాప్‌లో నమోదు కావాలని వ్యవసాయశాఖ అధికారి కె.కమల్‌రాజ్ రైతులకు సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి ఫిబ్రవరి 20లోగా ఈ– పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట రకం, విస్తీర్ణం, సర్వే నంబరు, ఫోన్ నంబరు ఆధార్ తదితర వివరాలు ఈ పంటలో నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వరి, చెరకు, పెసర, మినుము, నువ్వు తదితర పంటలున్నాయి. వరి 6,700 ఎకరాల్లో సాగయింది. మండలంలో 90శాతం మంది రైతులు 1121 వరి రకాన్నే సాగు చేస్తున్నారని కమల్‌రాజ్ వివరించారు. మొక్కజొన్న 5,500 ఎకరాల్లో సాగవుతోందన్నారు. చెరకు, వేరుశెనగ, అపరాలు, పొగాకు 8,500 ఎకరాల్లో సాగవుతున్నట్టు చెప్పారు. ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉద్యాన రైతులు తమ పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ అందుకోవడానికి పంటలకొనుగోలుకు మద్దతు ధర పొందేందుకు ఈపంట నమోదే ఆధారమని వివరించారు.

నాయీ బ్రాహ్మణులకు జగనన్న చేదోడు హర్షణీయం

కొవ్వూరు: నాయీ బ్రాహ్మణ కుల వృత్తి చేసుకునే వారికి జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేడూరి వీర్రాజు పేర్కొన్నారు. పట్టణంలో సత్యవతి నగర్‌లోని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కమ్యూనిటీలో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. పట్టణంలో తమ సంఘానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కమ్యూనిటీ హాలు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బొండపల్లి నరసింహారావు, అధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్, గౌరవ సలహాదారులు తాతపూడి ప్రసాద్, చింతలపూడి ప్రసాద్, కోడూరి రాము, మేడూరి సత్తిబాబు తదితరులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తాంజనేయస్వామికి గంధ సిందూరంతో పూజ



భక్తాంజనేయస్వామికి గంధ సిందూరంతో పూజ చేస్తున్న దృశ్యం

పెరవలి: జాతీయ రహదారి పక్కన నల్లాకులవారిపాలెంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఏకాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తులాభారంలో గురువారం 650 కిలోల పటిక బెల్లం ఆలయానికి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం గంధ సిందూరం, తమలపాకుల పూజ నిర్వహించారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

గో సంరక్షణపై రేపు మౌనదీక్ష

కొవ్వూరు: హిందువులు పవిత్రంగా భావించే గోవుల సంరక్షణ కోరుతూ ఈనెల 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట మౌన దీక్ష చేపట్టనున్నట్లు గోవు గౌతమీ గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న గోవులు, ఎద్దులు, అకాల మరణాలకు గురవుతున్నాయన్నారు. ఆకలికి ఆగలేక ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ అనేక మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. జనవరిలో నాలుగు గోవులు, గడిచిన ఏడాది కాలంలో పది గోవులు మృత్యువాత పడ్డాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి వైకల్యం పాలవుతున్నాయన్నారు. గోజాతి సంరక్షణలో భాగంగా రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులను యజమానులను గుర్తించి అప్పగించాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఉండ్రాజవరం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడుచుకోవాలని ఎస్సై కె.రామారావు అన్నారు. మండలంలో వేలివెన్నులోని అన్నపూర్ణ, శశి డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థులకు, నార్కోటిక్స్, డ్రగ్స్ సేవించడం, రవాణా, విక్రయం, కలిగి ఉండటం వల్ల కలిగే అనర్థాలు, శిక్షలు, పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల యాక్ట్ 1985, పోక్సో యాక్ట్ 2012ను వివరించారు. మైనర్లను ప్రేమ పేరుతో వేధించేవారికి కఠినమైన శిక్ష పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, అన్నపూర్ణ స్కూల్ అండ్ కాలేజీ ఇన్‌చార్జ్ నందిగం సీతారామయ్య, ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, శశి కాలేజీ ప్రిన్సిపాల్ జి.సత్యప్రకాష్, కానిస్టేబుల్స్ రమేష్, రాజు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమావేశం

తాళ్లపూడి: సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్‌లో సేవలు పెంచాలని ఎంపీడీవో ఎం రాజశేఖర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉగాది నాటికి సొంత ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇవోపీఆర్డీ కె ఎస్‌వీరన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నిడదవోలులో సేవకుల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న బొల్లవరపు జాన్‌వెస్లీ

నిడదవోలు: క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. నిడదవోలు ముంగర రత్నమ్మ ఆవరణలో సీఎండీసీ కార్యదర్శి జీవన్ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ.గుణశామ్యూల్ అధ్యక్షతన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సేవకుల సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,186 మంది పాస్టర్లకు రూ.5 వేలు చొప్పున ప్రతి నెలా గౌరవవేతనం అందిస్తున్నామని, త్వరలోనే మరో 3,500 మందికి మంజూరు చేస్తామని చెప్పారు. జెరూసలేం యాత్రకు ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. సీఎండీసీ జిల్లా అధ్యక్షుడు బత్తిన ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ సీఎండీసీ ద్వారా గ్రామీణ ప్రాంతాల పాస్టర్లను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అనంతరం రాష్ట్ర టిడ్కో డైరెక్టర్ కె.నాగేశ్వరికి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. సేవకులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, సీఎండీసీ నాయకులు బత్తుల ప్రభాకర్, కె.మాణిక్యాలరావు, రాంబాబు, పాస్టర్లు పాల్గొన్నారు.